క్లుప్తంగా

బీఎల్వోలకు అవగాహన


ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు ఈవీఎంల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శకుంతల, మండల గణాంకాధికారి (ఏఎస్ఓ) ఆదినారాయణ, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ ఈవీఎంల పనితీరు, నిర్వహణ విధానాలను బీఎల్వోలకు తెలియజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల విధులు కీలకమని, ఎన్నికల అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


నమూనాలను సేకరిస్తున్న ఏఓ

సి.బెళగల్: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సి.బెళగల్ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లోని దుకాణాల్లో నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే అమ్మకాలకు ఉంచాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నమూనాలను తీసుకుని పరీక్షల కోసం గుంటూరు, తాడేపల్లి గూడెం, విశాఖపట్నం ల్యాబ్‌లకు పంపించామని తెలిపారు.

అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తాం


పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో ఫారంపాండ్ విత్ బాండింగ్ పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం పొందవచ్చన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఉపాధి పనులకు సంబంధించిన జాబ్‌కార్డు, ఇష్యూ రిజిస్టర్, ఫిర్యాదులు, పని డిమాండ్, గ్రామసభ, స్థిరాస్తులకు సంబంధించిన ఏడు రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు.

ఆడ పిల్లల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఏసీడీపీఓ

పాణ్యం: సమాజంలో ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత అని నంద్యాల ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. శుక్రవారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన బేటీ బచావో.. బేటీ పడావో సూత్రాన్ని అందరు పాటించాలన్నారు. ఆడపిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని తెలిపారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098 లేదా 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఎంఈఓ కోటయ్య, సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దస్తగిరి అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. గుడిసెలో ఎవరూ లేని సమయంలో లోపలి నుంచి పొగలు వెలువడ్డాయి. చుట్టుపక్కల వారు గమనించేలోగా మంటలు ఏర్పడ్డాయి. మంటలను ఆర్పేందుకు నీటిని చల్లుతూ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లోని వస్తువులు, సామగ్రి బూడిదయ్యాయి. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు దస్తగిరి వాపోయారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్యం చల్లగ'కుండ'



- మట్టిపాత్రల్లో చేసే ఆహారంతో ఆరోగ్యం పదిలం
- కుండల్లోని నీటితో అనేక ప్రయోజనాలు
- వేసవిలో పేదల ఫ్రిజ్‌కు భలే డిమాండ్
- మార్కెట్‌లో అభిరుచులకు అనుగుణంగా మట్టిపాత్రలు, కుండలు లభ్యం

ఒకప్పుడు మన జీవితాలతో మట్టి పాత్రలు, కుండలు మమేకమై ఉండేవి. మారిన జీవనశైలి.. స్టీల్, ప్లాస్టిక్, పింగాణి, గాజు పాత్రలు రావడంతో వాటి వాడకం పూర్తిగా తగ్గిపోయింది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు మళ్లీ ఎక్కువ మంది మట్టి కుండలు, మట్టి పాత్రల వినియోగంపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో చేసే వంటకాలు రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు ఉండడమే ఇందుకు కారణం.

కర్నూలు (న్యూటౌన్): ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పేదోడి ఫ్రిజ్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో చేసిన ఆహారం తినడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో ధనవంతులు కూడా మట్టి కుండలోని నీటిని తాగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల మట్టి కూజాలు, కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు, వాటర్ క్యాన్లు, టీ గ్లాసులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

కుండలోని నీరు శ్రేష్టమైంది

మట్టి కుండలకు సహజ సిద్ధంగా తాగునీటిని చల్లబరిచే గుణముంది. మట్టికుండలో నీటిని నిల్వ చేసుకుంటే చల్లగా ఉండడంతో పాటు ఖనిజ లవణాలు నిల్వ ఉంటాయి. మట్టికుండలో నీటిని పోస్తే సూక్ష్మ రంధ్రాల ద్వారా వెచ్చదనం బయటకు వెళ్తుంది. ఆ నీటిని తాగితే శరీరంలో రక్తప్రసరణ బాగా జరిగి ఆరోగ్యంగా జీవించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగడంతో గొంతు నొప్పి, శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అయితే మట్టికుండలోని నీటి తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది. పైగా ఎలాంటి రోగాలు రావు. మండుటెండల్లో బయటకు వెళ్లి ఇంటికి వచ్చినప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తితీరి ఎంతో ఊరట లభిస్తుంది. కడుపులో మంట, ఇతర జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అతిగా దాహం వేయదు. వడదెబ్బ రిస్క్ కూడా తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.


పెద్దమార్కెట్ వద్ద మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మట్టిపాత్రల్లో చేసిన ఆహారం ఉత్తమం

మట్టి పాత్రలో చేసిన ఆహారం రుచిగా ఉంటుంది. ఆహార పదార్థాల్లో పోషకాలు వృథా కావు. ఆహారంలో యాసిడ్ మట్టి పాత్రల్లోని ఆల్కలైన్‌తో చర్యకు గురై పీహెచ్ స్థాయిలు తటస్థీకరిస్తుంది. మట్టి పాత్రల్లో చేసిన ఆహారం అన్ని రకాలుగా ఆరోగ్యదాయకం.

వేసవిలో భలే డిమాండ్

ప్రస్తుతం కర్నూలు నగరంలో మట్టి కుండలు, పాత్రలకు భలే డిమాండ్ ఉంది. గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు, జడ్చర్ల, వైఎస్సార్ కడప, అనంతపురం, నంద్యాల, పత్తికొండలో తయారు చేసిన మట్టి కుండలు, వాటర్‌ఫిల్టర్‌లు, నీళ్ల బాటిళ్లు, టీ కప్పులు, కూజాలు, దీపాలు, తులసికోట, బిర్యాని కుండలు, పెరుగు కుండలు, హుండీలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.


మట్టితో చేసిన టీకప్పులు


రంగురంగుల గుజరాత్ మట్టి కుండలు

రోజూ 20-60 కుండలు విక్రయిస్తాం



కులవృత్తిని నమ్ముకుని మట్టి కుండలు, పాత్రలను విక్రయించి జీవిస్తున్నాం. వేసవి కాలంలో మట్టి కుండలతో పాటు మట్టి వాటర్ బాటిల్స్, టీ కప్పులు, వాటర్ ఫిల్టర్‌లు సైజును బట్టి అమ్ముతున్నాం. ప్రతి రోజూ 20 నుంచి 60 వరకు కుండలు విక్రయిస్తాం. మట్టి కుండలు కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.

–శుభాష్, కుండల వ్యాపారి, కర్నూలు

మట్టి కుండలోని నీరు శ్రేష్టం



వేసవిలోనే కాకుండా అన్ని కాలాల్లో మట్టి కుండల్లోని నీరు ఎంతో శ్రేష్టం. ఎండలో బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే ఒక గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో హాయిగా ఉంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో ఎన్నో రకాల ఫ్రిజ్‌లు, వాటర్ ఫిల్టర్లు వచ్చినా మట్టి కుండలోని నీటికి సాటిరావు.

–ఖతీజాబీ, కర్నూలు

ఫ్రిజ్‌వాటర్‌తో ఆరోగ్య సమస్యలు



వేసవి కాలంలో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఫ్రిజ్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు. ఫ్రిజ్‌లోని చల్లటి వాటర్ తాగడం వల్ల గొంతునొప్పి, శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దగ్గు, జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మట్టి కుండలోని నీటిని తాగితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

–డాక్టర్ మీనుగ శ్రీనివాసులు, కర్నూలు

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లిన శివభక్తులు

గూడూరు: మండల కేంద్రానికి చెందిన పలువురు శివ భక్తులు శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బైన్‌దొడ్డి నుంచి పాదయాత్ర


బైన్‌దొడ్డి నుంచి శ్రీశైలానికి వెళుతున్న శివ భక్తులు

కోడుమూరు రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు మండలంలోని వెంకటగిరి, లద్దగిరి, కల్లపరి, బైన్‌దొడ్డి, పులకుర్తి గ్రామాల నుంచి శివభక్తులు శుక్రవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆయా గ్రామాల ప్రజలు మేళతాళాలతో వారిని సాగనంపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.165 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

సి.బెళగల్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌సీ వైద్యులు మిథున్‌కుమార్ రెడ్డి, సిబ్బందితో పల్స్ పోలియో నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగే పల్స్ పోలియోను వందశాతం పూర్తి చేయాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. సీహెచ్ఓ ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ మద్దిలేటి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు బస్సు ఏర్పాటు


ఆర్టీసీ బస్సుతో ప్రిన్సిపల్, ఇంటర్ విద్యార్థులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ బాలరాముడు తెలిపారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షా కేంద్రాలు 18 కి.మీ దూరంలోని గూడూరు మండలంలో ఉన్నా యి. విద్యార్థుల అవస్థలు, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కళాశాల ఖర్చులతో బస్సును ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో శుక్రవారం ఎమ్మిగనూరు డిపోకు చెందిన బస్సును ప్రతి రోజూ విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం పరీక్ష శుక్రవారం ప్రారంభం కావడంతో 75 మంది విద్యార్థులను బస్సులో పరీక్ష కేంద్రాలకు తరలించారు.

జగనన్న సురక్ష.. పేదల ఆరోగ్యానికి భరోసా

- డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య


వైద్య సేవలను ఆరాతీస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం వర్కూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలంతా హెల్త్ క్యాంపులో బీపీ, షుగర్, కంటి, రక్త, ఒంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వారికి ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్య చికిత్సలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్యాధికారులు శ్రీమంత్‌మాదన్న, డాక్టర్లు యామిని, నిరంజన్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్టారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవయ్య, కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

రైతుల జాబితాను పరిశీలించుకోవాలి

ఓర్వకల్లు: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లోని జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుక్కింగ్ నమోదైన పంటల వారీగా ఆయా గ్రామాల ఆర్బీకేల్లో రైతుల జాబితాను ప్రదర్శించామని చెప్పారు. వివరాలను చూసుకుని ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే రెండు మూడు రోజుల్లో చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


కోడుమూరు: మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసేందుకు వేచివున్న విద్యార్థినులు

కోడుమూరు రూరల్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కోడుమూరులో రెండు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 195 మంది విద్యార్థులకు గాను 8 మంది గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్లో 228 మంది విద్యార్థులకు గాను 17 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు విజయభాస్కర్, గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

తనిఖీ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్


పాణ్యం: జూనియర్ కళాశాలలో ఫ్లైయింగ్ స్క్వాడ్

పాణ్యం: మండలంలోని పరీక్షా కేంద్రాల వద్ద ఫ్లైయింగ్ స్కాడ్ తనిఖీలు చేసింది. పాణ్యంలోని టీ.చంద్రయ్య జూనియర్, నెరవాడమెట్టలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో శ్రీనివాసరెడ్డి, రఫీ తనిఖీ చేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (ఏపీ మోడల్ స్కూల్) పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జోషులా వాట్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చొప్పున నెట్ బ్యాంకింగ్/క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డులను ఉపయోగించి పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు. జనరల్ నంబర్ ఆధారంగా www.cse.ap.gov.in లేదా apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీ జరిగే పరీక్షలో వచ్చే మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

సోలార్ పార్కు భూముల పరిశీలన


చనకపల్లెలో భూములను పరిశీలిస్తున్న జేసీ

గడివేముల: మండల పరిధిలోని చనపల్లె గ్రామంలో నిర్మించనున్న సోలార్ పార్కు కోసం భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సోలార్ పార్కుకు కేటాయించిన 793 ఎకరాల భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అనుభవం ఉన్నవారికి నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. ప్రతి రైతును ఒప్పించి పేర్లను నమోదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, మండల సర్వేయర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని పైబోగుల గ్రామస్తులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని జేసీ తెలిపారు. ఆయన వెంట నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ మంచిని ప్రజలకు వివరిద్దాం


జేసీఎస్ మండల కన్వీనర్ తులసిరెడ్డి

సి.బెళగల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ తులసిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో మేము సిద్ధం మా బూతు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి వారి మద్దతు కోరాలని సూచించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న కొండయ్య, నాగేష్, రాజు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆలయ చైర్మన్ ఐసాని సునీల్ కుమార్ రెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం లాభదాయకం


హాజరైన పొదుపు మహిళలు


కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: కోళ్ల పెంపకంతో మంచి లాభాలు ఉంటాయని.. పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీంబాషా అన్నారు. శుక్రవారం కోడుమూరు స్త్రీశక్తి భవనంలో కోళ్ల పెంపకంపై పొదుపు మహిళలు, బుక్ కీపర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హీఫర్ సంస్థ సహకారంతో రూ.2500కు కోడి పిల్లల యూనిట్‌ను ఇస్తుందని.. కోళ్ల పెంపకం కోసం షెడ్ నిర్మాణానికి రూ.35 వేల రుణాన్ని అందజేస్తుందని తెలిపారు. మూడు నెలల తర్వాత పెరిగిన కోడి పిల్లలను ఆ సంస్థనే అప్పటి మార్కెట్ ప్రకారం కొనుగోలు చేస్తుందని చెప్పారు. మంచి లాభాలు వస్తాయన్నారు. ఆసక్తిగల మహిళలు ముందుకొస్తే కోళ్ల పెంపకంపై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే బుక్ కీపర్లు కూడా గ్రామాల్లోని మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైకేపీ ఏఓ షరీఫ్, డీపీఎం సుబ్బయ్య, పశువైద్యాధికారి అనీల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

గడివేముల: ఆలయాల్లో నిత్యం పూజలు జరిగితేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.బీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గడివేములలోని మూల పెద్దమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా తలారి చిన్నన్న, సభ్యులుగా గువ్వల కేశవరావు, పోలూరు పెద్ద మాచర్ల, నంద్యాల సులోచనమ్మ, చాకలి వెంకటేశ్వర్లు, దాసరి రవణమ్మ, శివయ్య, చిన్న సుంకమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మోహన్, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ల పండుగ

కోడుమూరు రూరల్: మండలంలో ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు వృద్ధులు, వితంతులు, వికలాంగుల ఇండ్ల వద్దకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుకలను అందజేశారు. శుక్రవారం సాయంత్రానికి కోడుమూరు మండలంలో 9182 పింఛన్లకు గాను 6065 మందికి అందజేశారని, మిగిలిన లబ్ధిదారులకు కూడా రెండు రోజుల్లో అందజేస్తారని కోడుమూరు ఎంపీడీఓ దివ్య తెలిపారు.

ఆస్పత్రికెళ్లి వెళ్లి పింఛన్ అందజేత

కోడుమూరు 3వ సచివాలయం పరిధిలో నివాసముంటున్న వృద్ధురాలు లక్ష్మీదేవి ఐదు రోజుల క్రితం పక్షవాతానికి గురై పెంచికలపాడులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటర్ మద్దమ్మ శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది.

కల్లూరు 62శాతం పంపిణీ

కల్లూరు: వలంటీర్లు ఉదయం నుంచే ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రానికి మండలంలో 62 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 8,460 మంది పింఛన్‌దారులు ఉండగా మొదటి రోజునే 5,280 (62శాతం) మందికి పంపిణీ చేశారు.


ఆస్పత్రికెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటర్ మద్దమ్మ